క్లుప్తంగా

చదవడం మాకిష్టం


చిన్నారులతో కథలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ

సింహాచలం: పెందుర్తిశాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులతో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పలు కథలు చదివించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిరహించారు. గెలుపొందిన విద్యార్థులకు కాకి వెంకటరమణ ఆర్థిక సాయంతో బహుమతులు అందజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.వి జయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ ప్రమీల, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి


వీఎస్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యా రంగంలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు.
ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ ఛైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. ఆయన స్మారకంగా గ్రంథాలయానికి డాక్టర్ వీఎస్ కృష్ణ పేరు పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ నిధులు రూ. 10కోట్లతో చేయనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆర్.ఆర్.వెంకటాపురం నుంచి చినముషిడివాడ వరకు సుమారు రూ.4కోట్లు, చినముషిడివాడ నుంచి పెందుర్తి జంక్షన్ వరకు రూ.1.56కోట్లతో బీఆర్‌టీఎస్ రోడ్డు మరమ్మతులకు, పెందుర్తి జంక్షన్ నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు రూ. 1.93కోట్లతో డ్రైనేజీ పనులకు, పెందుర్తి జంక్షన్ నుంచి రైల్వే బ్రిడ్జి స్టేషన్ వరకు రూ.1.98 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంతా సంక్షేమం, అభివృద్ధి దిశగా సాగిందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు ముమ్మన దేముడు, పీలా శ్రీనివాస రావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, పార్టీ నాయకులు వినోద్, బల్ల రాంబాబు, గొర్లె రామునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.
స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందికి అభినందన


ఆస్ట్రేలియా సందర్శనను పూర్తి చేసుకున్న ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బంది

సింధియా: ఆస్ట్రేలియాలోని ఫ్రీమాంటిల్ సందర్శనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం తిరిగొచ్చిన ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందిని తూర్పు నావికా దళ సబ్‌మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అభినందించారు. రాయల్ ఆస్ట్రేలియా నేవీతో ద్వైపాక్షిక వ్యాయామాల్లో వాగిర్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కెప్టెన్ ద్వారా రెండు దేశాల ద్వైపాక్షిక వ్యాయామాలకు సంబంధించిన మరిన్ని విషయాలను రాజేష్ పెంధార్కర్ అడిగి తెలుసుకున్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం రేపు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో రెండు ఆలయాలకు చెందిన భూముల ఫలసాయాన్ని 2023 అక్టోబర్ ఒకటి నుంచి 2026 మార్చి 31 వరకు అనుభవించుటకు కౌలు శిస్తు నిర్ణయించేందుకు ఈ నెల 10న మంగళవారం గ్రామ సచివాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్టు ఈవో నానాజీబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 217/1లోని 10.80 ఎకరాల మెట్టు, 45/1లోని 1.26 ఎకరాల పల్లం, 45/3లోని 2.46 ఎకరాల పల్లం భూమికి వేలం వేయనున్నట్టు ఆయన తెలిపారు. ఒక్కొక్క విస్తీర్ణానికి ధరావత్తు పైకం రూ.6 వేలు చొప్పున చెల్లించాలలని తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. రామాలయానికి చెందిన సర్వే నంబర్ 228/5లోని 84 సెంట్లు, 62 సెంట్ల విస్తీర్ణానికి 11.30 గంటలకు వేలం వేయనున్నట్టు తెలిపారు. ఒక్కొక్క విస్తీర్ణానికి ధరావత్తు పైకం రూ.1000 చొప్పున చెల్లించాలని తెలిపారు. పాటదారుడు మొదటి ఏడాది శిస్తు వెంటనే చెల్లించాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ప్రజలంతా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు పరిధి మీ సేవ వద్ద గల ఫిష్‌మార్కెట్‌లో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్స్‌లు, నార సంచులు ఉపయోగించాలని, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గుంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, పి.ఎస్.ఎన్.రెడ్డి, కామరాజు, వసంతరెడ్డి, మూర్తి, చంద్రకిరణ్, శ్రీరాములు, దిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరుతో కార్మికుల జీవితాలు బలి


969వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని, కార్మికుల జీవితాలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 969వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో హెచ్ఎంఎస్ యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్, పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండదండలు


సమావేశంలో మాట్లాడుతున్న వాసు

సీతమ్మధార : ఏయూటీడీ–జీవీఎంసీ షెల్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం నిర్వహించారు. డైమండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్, తెన్నేటి లాఫర్ క్లబ్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 10న నిరాశ్రయుల దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. దాతలు సమకూర్చిన భోజనం వసతిగృహంలో ఉంటున్న వారికి అందజేస్తూ, రోడ్డుపై ఉంటున్న అభాగ్యులను షెల్టర్‌కు పంపిస్తున్నామన్నారు. తెన్నేటి లాఫర్ క్లబ్ ప్రతినిధి ఐ.టి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ షెల్టర్లకు కావల్సిన బట్టలు, భోజనం అందిస్తూ తమ వంతు సహకరిస్తున్నామన్నారు. రెండు క్లబ్‌ల తరపున 80 మంది సభ్యులు నిరాశ్రయులకు అండగా ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డైమండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు పట్నాయక్, సెక్రటరీ కుమార్, సభ్యులు టి.ప్రసాద్, పి.జనార్దన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వేద, యోగా, సంగీత సాధనతో ఆనందమయ జీవితం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న అచ్యుతరామయ్య, సత్యదేవ్


కార్యక్రమంలో పాల్గొన్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ఆధునిక సమాజంలో వేద, యోగా, సంగీతపరమైన జీవన విధానం వల్ల సంతోషంగా జీవించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, కంచికామకోటి పీఠం తరఫున వెండి నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇటీవల కంచికామకోటి పీఠం వారు నగరంలో నిర్వహించిన సంగీత గానఝరి కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశంసాపత్రాలు, వెండి నాణేలతో సత్కరించినట్లు చెప్పారు. ముఖ్య అతిథి శంకరమఠం కార్యదర్శి టి.అచ్యుతరామయ్య మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదేశంతో జరిపిన సంగీత ఉత్సవంలో నగరంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారన్నారు. ఈ క్రతువులు సంగీత జనకులం పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సంస్థల సమన్వయంతో ఎన్నో సత్కార్యాలను చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం తరఫున అచ్యుతరామయ్యను డాక్టర్ సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, సంగీత జనకులం అధ్యక్షులు ఇంద్రగంటి కాశీప్రసాద్, ఐ.రమణీప్రసాద్, సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ బాలగణేష్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్. శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు


మాట్లాడుతున్న ఆచార్య పాండురంగ విఠల్‌మూర్తి

సీతంపేట: విశాఖ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో అడవి బాపిరాజు 128వ జయంతి సభ నిర్వహించారు. ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి మాట్లాడుతూ బాపిరాజు రచనలపై తన అభిరుచిని, అధ్యయనాన్ని వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ బాపిరాజు జీవిత విశేషాలను వివరిస్తూ, కథకుడిగా, నవలా రచయితగా, కళా దర్శకుడిగా బాపిరాజు బహుముఖ ప్రతిభను విశ్లేషించారు. జాతీయ వాదిగా ఆయన స్థానం మహోన్నతమైనదని కొనియాడారు.

సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, దీపాంజలినగర్ వంటి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఆదివారం రెండు బీచ్‌లు కళ కళలాడాయి. పర్యాటకులు తీర ప్రాంతాల్లోని జీడి, సరుగుడు తోటల వద్ద గడిపి అనంతరం బీచ్‌ల్లో ఇసుక మేటల్లో ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సందడి చేశారు. తిక్కవానిపాలెం బీచ్‌లోతాగునీటి సదుపాయం లేక సందర్శకులు అవస్థలు పడుతున్నారు. ముత్యాలమ్మపాలెం తీరంలో నీడ ఉండేలా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక


ఆత్మీయ కలయికలో రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. పాఠశాలలో 1989–90లో పదో తరగతి పూర్తి చేసిన వీరంతా అడ్డూరులోని మజ్జిగైరమ్మ గుడి ఆవరణలో కలిశారు. సుమారు 33 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను,అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. చదువు చెప్పిన గురువులు సైన్స్ టీచర్ ప్రకాష్ ,తెలుగు టీచర్ ఏసుదాసు,సోషల్ టీచర్ విష్ణు మాస్టర్‌లను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో సబ్బవరం ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, అన్నంరెడ్డి రమణమ్మ, జక్కాన సత్యవతి,కర్రి సన్యాసమ్మ,కామిరెడ్డి శ్రీనివాసరావు,గండి అప్పలనాయుడు,పంచదార్ల రమణ,గండి నాగరాజు,కొల్లి దేముడుబాబు,సబ్బవరపు నాయుడు,సబ్బవరపు వెంకట రమణ తదితరులు ఉన్నారు.

గ్రామ సింహాల బెడద


వాడచీపురుపల్లిలో రహదారిపై సంచరిస్తున్న వీధి కుక్కలు


ముత్యాలమ్మపాలెం తీరంలో సేదతీరుతున్న వీధి కుక్కలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో విచ్చల విడిగా సంచరిస్తున్న వీధి కుక్కల బెడదతో పల్లె వాసులు బెంబెలెత్తిపోతున్నారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, పరవాడ, వెన్నలపాలెం, కలపాక, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, తానాం, లంకెలపాలెం, పెదముషిడివాడ ప్రాంతాల్లో లెక్కకు మించి వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కలు రోడ్లు, ప్రధాన వీధులు, మాంసం, చేపల దుకాణాలను ఆవాసాలుగా చేసుకుని గ్రామీణ ప్రాంత ప్రజలపై విచ్చల విడిగా దాడులకు పాల్పడుతున్నాయి. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో కూడా వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో బీచ్ అందాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులు బెదిరిపోతున్నారు. పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీలకు రోజుకు నాలుగైదు కుక్కకాటు కేసులు వస్తున్నాయంటే వీధి కుక్కల బెడద ఏ విధంగా స్పష్టమవుతోంది. చీకటిపడితే రోడ్ల మీదకు వెళ్లడానికి గ్రామీణ ప్రజలు భయపడుతున్నారు. రోడ్లపై ప్రయాణించే వారిని గాయపరుస్తున్నాయి. రాత్రి సమయంలో వీధుల్లో మకాం వేసి అరుపులు కేకలతో నిద్ర లేకుండా చేస్తున్నాయని పల్లె ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉక్కుపై పోరుకు భెల్ సీఐటీయూ సంఘీభావం


రిలే నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న భెల్ సిటు నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ సంఘీభావం తెలుపుతుందని సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. ఆదివారం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర జరుగుతున్న 918వ రోజు రిలే నిరాహార దీక్షలో భెల్ సిటు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటు ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో స్టీల్‌ప్లాంట్ స్థాపించబడిందని, ఎన్నో ఉద్యమాలతో ఏర్పడిన ఈ కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించరాదన్నారు. స్టీల్ పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో భెల్ సిటు నాయకులు కె.విజయ్‌కుమార్, కె.నారపురెడ్డి, కె.పవన్‌కుమార్, జి.అచ్చంనాయుడు, జి.రాంబాబు, పి.శివరాం, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

తళతళలాడుతున్న భీమిలి బీచ్


ప్రత్యేక పద్ధతిలో బీచ్‌లో చెత్త తొలగిస్తున్న ట్రాక్టర్


చెత్త తొలగించడంతో తళతళలాడుతున్న బీచ్

నూతన వాహనంతో ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు

భీమునిపట్నం: భీమిలి బీచ్ ప్రస్తుతం తళతళలాడుతూ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సాధారణంగా ఇక్కడి బీచ్‌లోని ఇసుకలో చెత్తతో పాటు, నల్ల ఇసుక కూడా వుండడంతో పరిసరాలు ఇబ్బందికరంగా ఉండేవి. దీంతో సాయంత్రం వేళ బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇసుకలో కూర్చోవడానికి ఆసక్తి చూపేవారు కాదు. ఎప్పటి నుంచో ఈ పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం తీరంలోని చెత్త తొలగించడానికి ప్రత్యేక యంత్రంతో కూడిన ట్రాక్టర్‌ను జీవీఎంసీ సమకూర్చింది. ఆ వాహనం భీమిలి బీచ్‌లో అన్ని వైపులా తిరుగుతూ చెత్తను తొలగిస్తోంది. ఇసుక కిందన అడుగు లోతుకుపైనే కూరుకుని ఉన్న చెత్తనూ తొలగిస్తోంది. దీంతో బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇసుకలో సేదతీరడంతోపాటు పిల్లలతో ఆడుకుంటున్నారు.